క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



సిద్ధాంతం పిహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రభుత్వం అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బి.పావని అన్నారు. శుక్రవారం సిద్ధాంతం పీహెచ్‌సీలో ప్రతీ నెలా పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 74 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న మెరుగైన వైద్య పరీక్షలను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఓ బృందేశ్వరరావు పాల్గొన్నారు.

చెరువు తవ్వకం పనులు ప్రారంభం



రామన్నపాలెంలో చెరువు తవ్వకం పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

మొగల్తూరు: రామన్నపాలెం పంచాయతీలోని ఉప్పు చెరువు తవ్వకం పనులను శుక్రవారం సర్పంచ్ బందెల ఏలీషా, ఎంపీడీఓ ఆర్‌సి ఆనంద్ కుమార్‌లు ప్రారంభించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టిన అమృత్ సరోవర్ పథకంలో గ్రామంలోని ఉప్పు చెరువు తవ్వకం పనులను రూ.3.12లక్షలతో చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకంలో చెరువును తవ్వడంతో పాటు గట్లు వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, స్థానికులకు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణ పనుల పరిశీలన



సీసీ డ్రెయిన్ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ శుక్రవారం పట్టణంలోని 10వ వార్డులో14వ ఆర్థిక సంఘం నిధులు రూ 13.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతతో చేయాలని సూచించారు. పట్టణంలో అభివృద్ధి పనులకు 14వ ఆర్థిక సంఘం నిధులతో పాటుగా జనరల్ ఫండ్స్ పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరారు.ఆమె వెంట కౌన్సిలర్ చిట్టూరి కృష్ణ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ప్రారంభమైన జాతర ఉత్సవాలు



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని రాయిపేట ప్రసిద్ధ శ్రీ పుంతలో ముసలమ్మ అల్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 26 వరకూ జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద చండీహోమం, పంచామృత అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు తరువాత ఈ నెల 30న భారీ అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తమ్మిశెట్టి బాబ్జి, దేవరపు సుబ్బారావు, లింగం రాంబాబు, తాడి రాధాకృష్ణ, పోలిశెట్టి తాతారావు చెప్పారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశంచౌక్): గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయం మేంటీవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, ఎస్ఎల్‌జీ ప్రతినిధి వై.రణదివె, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి. రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో హైదరాబాద్‌లోని మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎస్ఎల్‌జీ (శ్రీ లక్ష్మి గాయత్రి)హాస్పిటల్‌కు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.సుధీర్ రోగులను పరీక్షించి, వైద్య సేవలు అందిస్తారన్నారు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, శస్త్ర చికిత్సలకు అవసరమైన వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు తమ పేరు నమోదు కోసం 63001 80993, 91333 39500కు ఫోన్ చేయాలని సూచించారు.

జగనన్న కాలనీల్లో చకచకా ఇళ్ల నిర్మాణాలు



పోడూరులో జగనన్న కాలనీ



చురుగ్గా సాగుతున్న ఇంటి నిర్మాణాలు

గ్రామం	కేటాయించిన ఇళ్లస్థలాలు	గ్రౌండింగ్ పూర్తయిఇళ్లు
పోడూరు	397	273
కవిటం	402	262
గుమ్మలూరు	253	155
మినిమించిలిపాడు	116	75
జగన్నాథపురం	115	82
పండితవిల్లూరు	119	70
పి.పోలవరం	69	61
జిన్నూరు	294	130
కొమ్ముచిక్కాల	238	133
పెనుమదం	441	190
మట్టపర్రు	156	102
వద్దిపర్రు	62	30
వేడంగి	211	104

పోడూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన నవరత్నాల హామీల్లో భాగంగా అధికారం చేపట్టిన వెంటనే పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో ఎంతోకాలంగా సొంతింటికల సాకారం కోసం ఎదురు చూస్తున్న నిరుపేదల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. కోర్టు కేసులు అనంతరం అధిక వర్షాల కారణంగా ఇళ్ల నిర్మాణ పనుల్లో కొంతకాలం జాప్యం జరిగినా గత కొద్దిరోజులుగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు ఎంతో చురుగ్గా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా 16 గ్రామాలకు సంబంధించి 38 లేఅవుట్‌లు ఉన్నాయి. వీటిలో మండలవ్యాప్తంగా 2873 మంది పేద అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాల కేటాయింపు జరిగింది. వీటిలో 1667 ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించగా దాదాపు 1080 ఇళ్లలో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారు. లేఅవుట్‌లలో విద్యుత్‌లైన్, మంచినీటి పైప్‌లైన్‌ల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇంకా పలు చోట్ల విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇంకా ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించని లబ్ధిదారులను వెంటనే పనులు ప్రారంభించేలా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వ సిబ్బంది ప్రోత్సహిస్తున్నారు. ఆచంట నియోజకవర్గం 8 గ్రామాల్లో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని 8 గ్రామాల్లో జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షల ఆర్థిక ప్రోత్సాహం, డ్వాక్రా సంఘాల ద్వారా ఇస్తున్న రూ.35 వేల రుణ సదుపాయంతో పాటు మరికొంత సొమ్ము సర్దుబాటు చేసుకుని లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా



నాకు భర్త చనిపోయి చాలాకాలం అయింది. అప్పట్నుంచీ నా కుమార్తెతో కలసి చాలా కాలం అద్దె ఇంట్లోనే ఉన్నాను. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఇంటిస్థలం ఇవ్వలేదు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే మా ఊరు సర్పంచ్, వలంటీర్ నేనుంటున్న ఇంటికి వచ్చి వివరాలు రాసుకున్నారు. తరువాత ఇంటి స్థలం వచ్చింది. ఇల్లు కట్టుకున్నాను. సీఎం జగనన్నకు మా జీవితాంతం రుణపడి ఉంటాం

– బందారు బేబీ, లబ్ధిదారురాలు, పోడూరు

15 ఏళ్ల నుంచి పడుతున్న బాధలు తప్పాయి



నేను అరటిపళ్ల వ్యాపారం చేస్తుంటాను. మాకు కుమార్తె, కుమారుడు సంతానం. పెళ్లైనప్పట్నుంచీ దాదాపు 15 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాము. గత ప్రభుత్వాలు ఉన్నపుడు అధికారులకు మొరపెట్టుకున్నా స్థలం ఇవ్వలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మాకు సొంతింటి కల నెరవేరింది. సీఎం జగనన్నకు మేము ఎల్లపుడూ రుణపడి ఉంటాము.

– పెచ్చెట్టి రామకృష్ణ, లబ్ధిదారు, పోడూరు

చురుగ్గా నిర్మాణాలు



మండలవ్యాప్తంగా అన్ని లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయి. ముఖ్యంగా కేటగిరి–3పై లబ్ధిదారుల కు అవగాహన కల్పిస్తున్నాం. కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా పర్యవేక్షిస్తున్నాం. ఇంకా గ్రౌండింగ్ పూర్తి చేయని వారిని వెంటనే పనులు ప్రారంభించేలా అవగాహన కల్పిస్తున్నాము.

– ఎస్.వెంకట్రాజు, హౌసింగ్ ఏఈ, పోడూరు

ఘనంగా సావిత్రి బాయి ఫూలే వర్ధంతి



మొగల్తూరులో సావిత్రి బాయి ఫూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పాలకొల్లులో సావిత్రిబాయి ఫూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి



ఆచంటలో సావిత్రీ బాయి ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

మొగల్తూరు: స్త్రీల విద్యాభివృద్ధి, వారి హక్కుల కోసం కృషి చేసిన సావిత్రి బాయి ఫూలేని ప్రతీ ఒక్కరూ స్మరించుకోవాలని పలువురు నాయకులు కోరారు. శుక్రవారం సావిత్రి బాయి ఫూలే 126 వ వర్ధంతి నేపథ్యంలో మొగల్తూరు, ముత్యాలపల్లి గ్రామాల్లో ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మొగల్తూరులో బీసీ ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కుక్కల సత్యనారాయణ, పెంకే చంటి, రాయుడు కృష్ణ, మోటుపల్లి ముత్యాలరావు, కుక్కల సోమేశ్వరరావు, జక్కంశెట్టి రాంబాబు, మధు, గుడాల శ్రీను పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: భారత దేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి ఫూలే వర్ధంతిని శుక్రవారం ఆచంటశివారు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించి విద్యారంగానికి చేసిన సేవ, బడుగు బలహీన వర్గాలకు చదువును చేరవేయడంలో భర్త జ్యోతీరావు ఫూలే కలసి చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.త్రిమూర్తులు, ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, నాగమణి పాల్గొన్నారు.

ఏఎస్ఎస్ఎం డిగ్రీ కళాశాలలో

పాలకొల్లు సెంట్రల్: మహిళల విద్య, సతీసహగమనం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం సావిత్రిబాయి ఫూలే చేసిన ఉద్యమాలు అద్వితీయమని కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి ఫూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు సావిత్రిబాయి ఫూలే గురించి అనేక విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె. పార్థసారధి, కనీ్వనర్ రామలక్ష్మి, డాక్టర్ వి విజయలక్ష్మి పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు మందుల పంపిణీ



నులిపురుగుల నివారణ మాత్రలకు అందిస్తున్న డాక్టర్ దివ్యభారతి, ఎంపీడీవో ఆనంద్ కుమార్

మొగల్తూరు: నులి పురుగుల నివారణతో ప్రతీ ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ దివ్యభారతి సూచించారు. ఈ నెల 14న నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నులిపురుగుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన 19 సంవత్సరాలలోపు విద్యార్థులందరికీ డీ వార్మింగ్ మాత్రలు అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం ప్రతీ విద్యార్థికి డీవార్మింగ్ మాత్రలు పంపణీ చేయాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులకు మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్‌సీ నంద్ కుమార్, ఎంపీహెచ్‌ఓ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ కంటి ఆసుపత్రికి రూ.4 లక్షల వితరణ



లయన్స్ కంటి ఆసుపత్రికి రూ.4లక్షల వితరణ అందిస్తున్న పెన్మెత్స బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: లయన్స్ కంటి ఆసుపత్రికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు అలాగే ఆయన సోదర సంస్థ అయిన డెక్కన్ కెమికల్స్, హైదరాబాద్ సంయుక్తంగా రూ.4లక్షలు వితరణ చేశారు. ఈ చెక్కును శుక్రవారం ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు లయన్స్ ఐ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ కారుమూరి వెంకట నరసింహరావుకి శుక్రవారం అందజేశారు. పేదల కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు ప్రతీ ఏటా రూ.2 లక్షల వితరణ చేస్తూ ఈ ఏడాది మరో రూ.2 లక్షలు అదనంగా చేసిన ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ డా. సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి), కంటి ఆసుపత్రి కోశాధికారి కేవీ నరసింహం తదితరులు ఫౌండేషన్ సేవలను అభినందిస్తూ చైర్మన్ వెంకట్రామరాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత న్యాయ సహాయంపై అవగాహన



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న దేవేంద్ర ఫణికర్

నరసాపురం: మహిళలు న్యాయ సహాయానికి, న్యాయ సలహాలకు నరసాపురం కోర్టు వద్ద మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చని ఉచిత న్యాయవాదులు చెప్పారు. సరిపల్లి గ్రామంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఉచిత న్యాయవాదులు యర్రంశెట్టి ఫణికర్, గన్నాబత్తుల శివాజీచక్రవర్తి, ఇంజేటి జాన్‌కెనడీ మాట్లాడారు. చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తమ హక్కులు తెలసుకోవాలని చెప్పారు. మహిళా చట్టాల అమలకు మండల న్యాయసేవాధికార సంస్థ చేస్తున్న కృషిని వివరించారు ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నక్కా ఆనందబాబు, బళ్ల శ్రీహరి, డి.చాముండేశ్వరి పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం



అడవిపాలెంలో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

యలమంచిలి: ఉగాది సందర్భంగా అడవిపాలెం గ్రామంలో నిర్వహించే గ్రామదేవత కనకదుర్గమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఘటాలను తలపై ఎత్తుకుని మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. తమ ఇళ్లకు వచ్చిన ఘటాలకు భక్తులు అమ్మవారి పాదాలు పసుపు నీళ్లతో కడిగి, కొబ్బరికాయలు, అరటిపళ్లు నైవేద్యం సమర్పించి కర్పూరంతో హారతులిచ్చారు. ఉత్సవాలలో భాగంగా ఉగాది ముందు రోజు మార్చి 21న గ్రామానికి తూర్పు వైపున జాతర మార్చి 22న ఉగాది రోజు గ్రామానికి పడమర వైపు జాతర నిర్వహించి మార్చి 23న ఊయల సేవతో అమ్మవారిని ఆలయ ప్రవేశం చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయని మెట్టింనింటి వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని గాంధీ అమ్మవారి పుట్టింటి వంశపారంపర్య ధర్మకర్తలు పొట్టుపోతు నాగ లక్ష్మణ శ్రీనివాసరావు, అడబాల రాజేష్ తెలిపారు.

కోర్టు ఆవరణలో మహిళా దినోత్సవం



కోర్టు ఆవరణలో జడ్జి భానుసాయితో న్యాయవాదులు, మహిళా పోలీసులు

పాలకొల్లు సెంట్రల్: రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు కల్పించిందని అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి పి భానుసాయి అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో పట్టణ సచివాలయ మహిళా పోలీస్‌లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జడ్జి భానుసాయి మాట్లాడుతూ మహిళలకు జరిగే అన్యాయాలపై వేగంగా స్పందించాలని సూచించారు. అలాగే మహిళలకు జరిగే అన్యాయాలపై ఏ విధంగా ఫిర్యాదులు చేయాలి ఎలా స్పందించాలి? అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ బార్ అసోసియేషన్ సభ్యులు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

శ్రీవారి నిధులతో రాములోరి గుడుల నిర్మాణం



పెదకాపవరంలో రామాలయం అభివృద్ధికి కోసం సహకరించాలని వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: రాములోరి గుడులు అభివృద్ధికి, పునర్నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవారి నిధులు రూ.10 లక్షలు కేటాయిస్తున్నారని దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వీ.వెంకటేశ్వర రావు చెప్పారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలోని కోదండ రామాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ పెదకాపవరం, చినకాపవరం గ్రామాల్లోని శ్రీరామచంద్రమూర్తి ఆలయాలకు నిధుల కోసం గ్రామస్తులు విజ్ఞప్తులు చేశారని చెప్పారు. ప్రతిపాదనల్ని టీటీడీకి పంపుతామని చెప్పారు. గతంలో మండలంలోని గుమ్ములూరుతో పాటు ఇతర మండలాల్లో వచ్చిన ప్రతిపాదనలు పంపగా రూ. 10 లక్షలు మంజూరు చేస్తూ ఆదేశాలు వచ్చాయన్నారు. త్వరలోనే ఈ దేవాలయాలకు కూడా నిధులు వస్తాయని చెప్పారు. కోదండ రామాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ కళారి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. టీటీడీ నిధులు కూడా వస్తే ఆలయం మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాతపాటి శ్రీనివాసరాజు, కళారి రామకృష్ణ(రాము), రెడ్డియ్య, విశ్వనాథం, ఆలయాల మేనేజర్ రంగరాజు పాల్గొన్నారు.

యూత్ హాస్టల్స్ సభ్యత్వం ద్వారా సదుపాయాలు

సాక్షి, భీమవరం: యూత్ హాస్టల్స్ సభ్యత్వం ద్వారా వివిధ ప్రాంతాల్లో అనేక సదుపాయాలు పొందే అవకాశం ఉందని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) అన్నారు. శుక్రవారం యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైహెచ్ఏఐ) ఇన్స్టిట్యూషనల్ సభ్యత్వాన్ని అసోసియేషన్ భీమవరం డిస్ట్రిక్ యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణ డీఎన్నార్ కళాశాలకు సభ్యత్వ సర్టిఫికెట్స్‌ను అందచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వైహెచ్ఏఐ సభ్యత్వం పొందితే విజ్ఞాన, విహారయాత్రలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలకు వైహెచ్ఏఐ అనేక సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజన్‌కుమార్, కళాశాల సహాయకార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, తాళ్లపూడి గాంధీ, అబపాల రామ్మూర్తి, బోణం పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాదాన్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



వేంద్ర హేమశ్రీ

మొగల్తూరు: బెంగుళూరుకు చెందిన సరోజిని దామోదర ఫౌండేషన్ నిర్వహించిన స్కాలర్ షిప్ పరీక్షలో ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలకు చెందిన వేంద్ర హేమశ్రీ ఎంపికైనట్లు హెచ్‌ఎం బాల నాగమణి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భం బాల నాగమణి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతీ ఏటా ఆన్‌లైన్‌లో పరిక్షలు నిర్వహిస్తారన్నారు. గతేడాది జూన్‌లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన స్కాలర్ షిప్ పరిక్షలో హేమశ్రీ ఎంపికైనట్లు నిర్వాహకుల నుంచి సమాచారం అందిందన్నారు. దీనిలో భాగంగా ఇంటర్, డిగ్రీలో రూ.10 వేలు, బీటెక్ అయితే రూ.20 వేలు, డాక్టర్ అయితే రూ.60 వేలు చొప్పున ప్రతీ ఏటా అందిస్తారన్నారు. ప్రస్తుతం హేమశ్రీ నరసాపురంలోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుందన్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కొపనాతి పల్లయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు హేమశ్రీని అభినందించారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ



పెనుగొండలో సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశం

పెనుగొండ: కేంద్ర బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘ జిల్లా కార్యదర్శి ఎం రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మోడీ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని రైతు, కార్మిక సంఘాల రౌండ్ సమావేశం శుక్రవారం పెనుగొండ ప్రజా సంఘాల కార్యాలయాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకురాలు కె.తులసి, రైతు కార్మిక వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, కె.సుబ్బరాజు, అనురాధ, ఉషశ్రీ, లక్ష్మీ కుమారి, షేక్ పాదుష, జి.సత్యనారాయణ, ఎన్.గంగారావు, పి.పద్మ, విజయలు పాల్గొన్నారు.

17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పాలకొల్లు అర్బన్: స్థానిక మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సంబంధిత శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

పారదర్శకంగా జగనన్న భూహక్కు సర్వే



పెదకాపవరం గ్రామంలో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆకివీడు: జగనన్న భూహక్కు–రక్షణ పథకంలో భాగంగా భూముల రీ సర్వే పారదర్శకంగా జరుగుతుందని ఎంపీపీ కళారి జయలక్ష్మీ చెప్పారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో డ్రోన్ సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలం వాయిదా పడిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునః ప్రారంభించడం అభినందనీయమన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రీ సర్వే వేంగవంతంగా జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే పలు గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయ్యిందన్నారు. రికార్డుల ప్రకారం రీ సర్వేను రెవిన్యూ అధికారులు వేగవంతం చేశారని చెప్పారు. గ్రామంలో 4,500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములను సర్వే చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊసల బేబీ స్నేతు, వైఎస్సార్ సీపీ నాయకులు కళారి రామకృష్ణ (రాము), కేశవరావు, పాతపాటి శ్రీనివాసరాజు, ఆదాం, కట్రెడ్డి వెంకన్న(చంటి), వీఆర్వో బొల్లెంపల్లి ప్రసాద్, కార్యదర్శి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.